## క్లుప్తంగా

### గాలి రేవతీ దేవికి కళా సరస్వతి బిరుదు



వినుకొండ: ఉగాది వేళ చిలకలూరిపేట ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి నిర్వహించిన ఉత్సవ సభలో వినుకొండకి చెందిన ప్రముఖ నృత్య శిక్షణాలయం శ్రీ లక్ష్మీ నృత్య కళాశాల డైరెక్టర్ గాలి రేవతి దేవీకి ఉగాది పురస్కారం తోపాటు కళా సరస్వతి బిరుదు ప్రదానం చేశారు. 5 సంవత్సరాల ప్రాయం నుంచి భరతనాట్యం కళను అభ్యసించి 11 సంవత్సరాల వయసు నుంచి ఎన్నో ప్రదర్శనలిచ్చి, నేటికీ కూడా భరత నాట్య శిక్షణను కొనసాగిస్తున్నారు ఆమె. తన 35 సంవత్సాల సుదీర్ఘ శిక్షణాను భావంతో ఎంతో మందిని కళాకారిణులగా తీర్చిదిద్దారు. వినుకొండలో జరిగే అనేక భక్తి ఉత్సవాలలో, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో తమ విద్యార్థినుల చేత భరత నాట్య, జానపదాలలో ప్రదర్శనలు ఇప్పిస్తూ కళా సేవ కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా అనేకమంది పట్టణ ప్రముఖులు గాలి రేవతి దేవిని అభినందించారు.

### పది మంది విద్యార్థులకు ఆర్థిక సాయం



యడ్లపాడు: తల్లిదండులు లేని విద్యార్థుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని హెచ్ఎం కేవీ రామిరెడ్డి చెప్పారు. లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు 10 మందికి రూ.20 ఆర్థిక సాయాన్ని బుధవారం దాతలు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ లింగారావుపాలెం గ్రామానికి చెందిన మదర్ ఇండియా కాటన్ ట్రేడర్స్ అధినేత నంబూరు రమేష్ రూ.15 వేలు, కన్నెగంటి వీరాంజనేయులు రూ.5 వేలు ఇవ్వగా వాటిని తమ పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2 వేలు చొప్పున పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దాతతో పాటు ఎస్ఎంసీ చైర్మన్ షేక్ జాన్‌సైదులు, గ్రామపెద్దలు నంబూరు శివరామకృష్ణయ్య, ఉపాధ్యాయులు డి.రామాంజనేయులు, వి.శ్రీనివాసరావు, టి.విజయశామ్యూల్, డి.సుధాకరరావు పాల్గొన్నారు.

### జీవనోపాదుల క్రిడిట్ ప్లాన్ కార్యక్రమం



శావల్యాపురం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక, జీవనోపాదులు క్రిడిట్ ప్లాన్ కార్యక్రమం స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీయం జి.వాసుబాబు మాట్లాడుతూ సంవత్సర కాల పరిమితిలో గ్రామ సంఘం స్థాయిలో గ్రూపు సభ్యులు నెలవారీ సమావేశం నిర్వహించి సభ్యురాలు చేస్తున్న జీవనోపాదులు వారి అవసరాల నిమిత్తం ప్రణాళికలు ఎన్యూమరేటర్స్ తయారు చేయాలన్నారు. ప్రభుత్వం ఒక గ్రూపునకు సంబంధించిన జీవనోపాదులు తయారు చేసినందుకుగాను ఎన్యూమరేటర్‌కు రూ.50 రూపాయలు ఇస్తారన్నారు. 26 గ్రామసంఘాలు ఉండగా 130 ఎన్యూమరేటర్స్ ఉంటారన్నారు. గ్రూపులో తొలగింపు సభ్యురాలు, మృతిచెందిన వారిని తొలిగించే విధంగా ఏపీయం లాగిన్ ద్వారా చేయటానికి అవకాశం కల్పించనట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి,సెక్రటరి వేగుళ్ళ కుమారి, సీసీలు ఖాజావలీ, మేరి కుమారి, కరుణమ్మ గ్రామసంఘం వీవోఏలు పాల్గొన్నారు.

### వైభవంగా మహాగణపతి విగ్రహ ప్రతిష్ట



ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని సీతారామస్వామి దేవస్థానం పక్కన మహాగణపతి నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి సుప్రభాతసేవ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారిని ప్రతిష్ఠించారు. యేరువ సాంబశివరెడ్డి, ధనుంజయరెడ్డి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# డొంక పోరంబోకు స్థలాన్నీ ఆక్రమించేశాడు!

- మట్టితో మెరక సైతం తోలించి...
- ఇదేమి విడ్డూరమంటూ గణపవరం వాసుల ఆక్షేపణ
- చర్యలు తీసుకుంటామన్న పంచాయతీ అధికారులు



గణపవరంలో ఆక్రమణకు గురైన స్థలం

నాదెండ్ల: గణపవరం గ్రామ పంచాయతీ పరిధిలో డొంక పోరంబోకు స్థలాన్ని ఓ వ్యక్తి గ్రావెల్ వేసి ఆక్రమించేందుకు యత్నించటం స్థానికుల్లో చర్చనీయాంశమైంది. గణపవరం నుంచి చిలకలూరిపేట వెళ్ళే డొంక రోడ్డులో కుప్పగంజివాగు సమీపంలో సర్వే నెం.499లో సుమారు 20 సెంట్లు డొంక పోరంబోకు స్థలం ఉంది. కొన్నేళ్ళ క్రితం ఈ స్థలాన్ని మండలానికి సంబంధించిన పాత్రికేయులు ఇళ్ల స్థలాలకు కావాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు అందించారు. అప్పట్లో పాత్రికేయుల అర్జీని ఉన్నతాధికారులకు పంపారు. ఈలోగా ప్రభుత్వం మారటంతో ఈ స్థలంలో సచివాలయం నిర్మించాలంటూ స్థానిక నాయకులు ప్రతిపాదనలు చేశారు. పాత్రికేయులు స్థానిక నాయకుల మాటను గౌరవించి సచివాలయ నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేశారు. అయితే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు స్థలాన్ని సర్వే చేసి సచివాలయం నిర్మాణానికి స్థలం అనుకూలంగా లేదని నివేదించారు. దీంతో స్థలం ఖాళీగా ఉండటంతో కొందరు వ్యక్తులు ఇటీవల కొంత స్థలంలో ఎర్ర గ్రావెల్ తోలి ఆక్రమణకు యత్నిస్తున్నారు. దీనిపై స్థానికులు తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు.

### రక్షణ కంచె వేయిస్తా



గణపవరం–చిలకలూరిపేట డొంక రోడ్డులో సర్వే నెం.499లో డొంక పోరంబోకు స్థలం ఉంది. స్థలం ఆక్రమణ విషయం మా దృష్టికి రాలేదు. ఎవరైనా ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. గ్రామ సర్వేయర్‌తో సర్వే చేయించి స్థలం రక్షణకు కంచె వేయిస్తాం. –మారుతీబాబు, పంచాయతీ కార్యదర్శి

# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

**14వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల దీక్షలు**



శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న రెడ్‌బాష

నరసరావుపేట: మున్సిపల్ కార్మికులకు సమానపనికి సమాన వేతనం వర్తింపచేయాలని ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి రెడ్‌బాష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని ఎంసీపీఐయుతో పాటు ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా రెడ్‌బాష మాట్లాడుతూ నెల మొత్తం పని చేసినా పూర్తి వేతనాలు ఇవ్వడం లేదని, అరకొర వేతనాలతో ఎలా బతకాలని మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వారు చేస్తున్న దీక్షలు 14వ రోజుకు చేరాయన్నారు. నెలరోజుల వేతనాలు ఇవ్వాలని కోరడంలో న్యాయం ఉందన్నారు. పురపాలక సంఘం అధికారులు కార్మికుల శ్రమను దోపిడీ చేయడం తగదన్నారు. ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్న 40 మంది కాంట్రాక్ట్ కార్మికులకు పనిచేసిన అన్ని దినాలకు వేతనాలు ఇవ్వడం లేదని, మిగతా కార్మికులతో పాటు ఎనిమిది గంటలు పని చేస్తున్నారన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులతో పాటు వీరి పేర్లు ఏపీ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో నమోదైనా వివక్ష ఎందుకని అధికారులను ప్రశ్నించారు.
పట్టణీకరణ పెరిగి నరసరావుపేట జిల్లా కేంద్రమైన నేపథ్యంలో కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్మికుల న్యాయమైన కోరికలను మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరిష్కరించి ఉద్యోగ భద్రతను కల్పించాలని సమానపనికి సమానవేతనం రూ.21 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలని, వారికి ఎంసీపీఐయూ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. మున్సిపల్ కార్మికులు నిరసన దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. కార్మికుల నిరసన దీక్షలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటానాయక్, ఎంఐఎం నాయకులు షేక్ మౌలాలి, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు షేక్ మస్తాన్‌వలి, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, సీఐటీయూ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సాల్మన్, నాయకులు నరసింహారావు పాల్గొన్నారు.

# కొత్తలూరు వెళ్లి రావాలంటే భయమేస్తోంది!

**కమ్యూనిస్టు నేత ఆవేదన**



రహదారిని చూపిస్తున్న మోహన్‌చందు

శావల్యాపురం: మండల కేంద్రం నుంచి కొత్తలూరు గ్రామానికి వెళ్లే రహదారి మార్గం అధ్వానంగా ఉందని మండల సీపీఎం కార్యదర్శి కె.వి.ఆర్. మోహన్ చందు వాపోయారు. బుధవారం దెబ్బతిన్న రహదారి మార్గం పరిశీలించి మాట్లాడుతూ నెల రోజుల క్రితం రహదారి మార్గం అంతా పగలికొట్టి కొంతమేర తారురోడ్డు పనులు చేశారన్నారు. అయితే పోట్లూరు డొంక నుంచి శావల్యాపురం గ్రామం వచ్చే వరకు 1500 మీటర్ల మేర పనులు నిలుపుదల చేసి నెలరోజుల అవుతుందని ఈ విషయంపై పలుమార్లు ఆర్అండ్‌బీ ఏఈ దృష్టికి తెలిపినా ఫలితం లేదన్నారు. ఈ రహదారి మార్గం కొచ్చెర్ల, ఈపూరు, గ్రామాలను అనుసంధానం చేశారు. ప్రస్తుతం రహదారి మార్గం దుస్థితి కంకర రాళ్లు దాటికి బైకులు అదుపుతప్పి పడిపోవటం పంచర్లు పడటంతో పాటు మరమ్మతులు గురౌతున్నాయన్నారు. రాత్రి సమయంలో ఆదమరిచి వాహనాలు నడిపితే ఆస్పత్రి పాలయ్యే అవకాశం ఉంది.. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే ఆగిపోయిన ఏరియా నుంచి రోడ్డు పనులు ప్రారంభించాలని కె.వి.ఆర్ మోహన్ చందు కోరారు.

### సీపీఐ ప్రచార కార్యక్రమం




బొల్లాపల్లి : మండలంలోని వెల్లటూరు, అయ్యన్నపాలెం, మేకల దిన్నె, బండ్లమోటు, బొల్లాపల్లి గ్రామాల్లో సీపీఐ ప్రచార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని, దేశ లౌకిక వ్యవస్థను రక్షించాలని పిలుపునిస్తూ కేంద్రంలో మోదీ సాగిస్తున్న నిరంకుశ, మతోన్మాద పరాకాష్టకు చేరిన రాక్షస పాలనకు వ్యతిరేకంగా సీపీఐ జాతీయ సమితి పిలుపుమేరకు చేపట్టిన ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తన సుదీర్ఘ పాలనలో దేశానికి నష్టం చేకూర్చడం తప్ప ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదన్నారు. మోదీ ప్రభుత్వం వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, రాయబారం వందనం, కె.మల్లికార్జునరావు, రవి, షేక్ సైదా, నరసింహారావు, రామకోటి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వమే మిర్చి కొనుగోలు చేయాలి

- కనీస మద్దతు ధర ఇవ్వాలి
- రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్



మాట్లాడుతున్న రాధాకృష్ణ

నరసరావుపేట: క్వింటా మిర్చి కనీస మద్దతు ధర రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం నేరుగా కొను గోలు చేసి రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం పల్నాడు కార్యదర్శి వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మిర్చి రైతుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తమ వంతు కృషి చేసి వారిని ఆదుకోవాలని,. రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల నాల్గవ తేదీ శుక్రవారం గుంటూరు మిర్చియార్డులో చేపట్టనున్న ధర్నాకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిర్చి సాగుచేసిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. బుధవారం కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాధాకృష్ణ మాట్లాడుతూ చీడ, పీడలు తెగుళ్ల బెడదతో ఈ ఏడాది ఆశించిన మేర దిగుబడులు లేక మిర్చి సాగు చేపట్టిన రైతులు, కౌలు రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. వారికి కనీస మద్దతు ధర అమలు చేసి ఆదుకోవాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.11,781లు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. వ్యవసాయం, ఎరువులు, విత్తనాలు, కౌలు ఇతర ఖర్చులలో సంబంధం లేకుండా కేవలం క్వింటా మిర్చి కోత కూలి, గ్రేడింగ్‌కు రూ.8 వేలు ఖర్చు అవుతుందన్నారు. రెండు నెలల క్రితం ప్రయివేటు వ్యక్తులకు తక్కువ ధరకు అమ్ముకున్న రైతులకు రూ.5 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి ఇప్పటి వరకు ఎటువంటి పరిహారం అందించలేదన్నారు. గ్రామస్థాయిలో కౌలు రైతులను గుర్తించి గ్రామంలోనే గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. ధరల స్థిరీకరణ నిధికి ప్రభుత్వం కేటాయించిన రూ.300 కోట్లు ఏ మాత్రం సరిపోదని, రూ.5వేల కోట్లకు పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. మిర్చి ఎగుమతులకు ఉన్న అవకాశాలను పరిశీలించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.

# జయంతి ఉత్సవాలను పోరాట దినాలుగా పరిగణించాలి

**కరపత్రం ఆవిష్కరించిన కేఎన్‌పీఎస్, ప్రజాసంఘాల నాయకులు**



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసరావుపేట: మహాత్మా జ్యోతీరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతులను దళిత పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటించాలని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 11న పూలే, 14న అంబేద్కర్ జయంతోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ మేరకు కరపత్రాలను స్టేషన్ రోడ్డులోని గాంధీపార్కులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సామాజిక ఉద్యమ కారులైన పూలే, అంబేడ్కర్‌లను కులచట్రంలో బిగించి ఉంచే అగ్రకుల రాజకీయ పార్టీల నాయకులు కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. రాజకీయ నాయకులు నిర్వహించే పూలే, అంబేడ్కర్ జయంతోత్సవాలను బహిష్కరించాలని, వారు వేసే కమిటీలలో భాగస్వాములు కావొద్దని దళిత, బీసీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, శిఖినం సాంబయ్య, కేఎన్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్న ప్రసాద్, సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, కమిటీ సభ్యులు చలంచర్ల అంజి పాల్గొన్నారు.

### ఉన్నతమైంది నర్సింగ్ వృత్తి



నరసరావుపేట ఈస్ట్: ఉన్నతమైన నర్సింగ్ విద్యను విలువలతో పూర్తి చేయాలని ఆర్డీఓ కె.మధులత తెలిపారు. పీఎన్‌సీ అండ్ కె.ఆర్. నర్సింగ్ కళాశాలలో బుధవారం జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల నూతన విద్యార్థులను ఆహ్వానిస్తూ ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీఓ మధులత మాట్లాడుతూ, నర్సింగ్ నోబెల్ ప్రొఫెషన్‌గా గుర్తింపు పొందిందన్నారు. నర్సింగ్ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకొని రోగులకు ఆప్యాయతతతో కూడిన సేవలు అందించాలని హితవు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ పి.శ్రీనివాసప్రసాదు, ప్రిన్సిపల్ డి.గోపినాథ్, వైస్‌ప్రిన్సిపల్ బి.సుజీకల్పన, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికస్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న ఝాన్సీరాణి

నాదెండ్ల: రుణాలు పొందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు సకాలంలో రుణాలు చెల్లిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పాకాల ఝాన్సీరాణి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల మండల సమాఖ్య కార్యాలయంలో ఎంపికైన ఎన్యూమరేటర్లకు నాలుగు రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు అప్పులు, జీవనోపాధుల ప్రణాళికల తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఎంపికైన ఎన్యూమరేటర్లు గ్రామ స్థాయిలో డోర్ టు డోర్ క్యాంపు నిర్వహించారన్నారు. ఒక్కో గ్రామానికి ఐదుగురు ఎన్యూమరేటర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 10లోపు ఆర్థిక ప్రణాళిక రూపొందించాలన్నారు. యాప్‌లో నమోదు, సమస్యలకు పరిష్కారాలు సూచించారు. కార్యక్రమంలో డీపీఎం హనుమానాయక్, ఏపీఎం రమేష్, సీసీలు సాంబశివరావు, హేమలత, సుధ పాల్గొన్నారు.

# ఒకేషనల్ ఉపాధ్యాయుడు శ్రీకృష్ణ సేవలు అభినందనీయం



శ్రీకృష్ణ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవమైందని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఉపాధ్యాయులు వూటుకూరి శ్రీకృష్ణ విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 39 వసంతాల ఉద్యోగ బంధానికి విద్యా మార్గ దర్శకాలకు నిలిచి అందరి మన్ననలు పొందటం అభినందనీయమన్నారు. అనంతరం శ్రీకృష్ణ-పద్మ దంపతులను పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, గరికపాటి రవి, అబ్దుల్లా, నిర్మల, భువనేశ్వరి, శ్రీకాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు.

### పేటలో ఐదు చలివేంద్రాలు ప్రారంభం



నరసరావుపేట: వేసవి కాలంలో దాహం తీర్చేందుకు పట్టణంలోని ఐదు ప్రదేశాల్లో పురపాలకసంఘం ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. ఇవి పాదచారులు, పట్టణ పౌరుల దాహార్తిని తీరుస్తాయన్నారు. వీటిని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ ఎం.జస్వంతరావు, మున్సిపల్ డీఇ మహమద్ రఫీ, నాయకులు కపలవాయి విజయకుమార్, వాసిరెడ్డి రవి, కోవూరి బాబు, శ్యామ్ పాల్గొన్నారు.

# చామర్రు గ్రామ భూముల ఆన్‌లైన్ ప్రారంభం

అచ్చంపేట: మండలంలోని చామర్రు రెవెన్యూ పరిధిలోని గ్రామాల సేద్యపు భూములను ఆన్‌లైన్ చేసి యూనిక్ నంబరు ఇచ్చే ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభించినట్లు ఏవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఈ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, కానీ చామర్రు రెవెన్యూ పరిధిలోని గ్రామాల భూముల నమోదు కార్యక్రమం సాంకేతిక సమస్యల కారణంగా కాలేదన్నారు. ఉన్నతాధికారుల చొరవతో సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. చామర్రు రెవెన్యూ పరిధిలోని గ్రామాల రైతులు యూనిక్ నంబరు నమోదు చేయించుకునేందుకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రావలసి ఉంటుందని చెప్పారు. మరో వారం రోజులపాటు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని, రైతులు త్వరపడి సహకార పరపతి సంఘం వద్ద గల రైతు సేవా కేంద్రంలో తమ భూములను ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. యూనిక్ నంబర్లు ఉంటేనే ప్రభుత్వ రాయితీలు, పంట కొనుగోళ్లు, ప్రభుత్వ పరిహారం వంటివి పొందే అవకాశం ఉంటుందని ఏవో తెలిపారు.

# బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న సీఐ సుభాషిణి

నకరికల్లు: కొత్తవారు, పరిచయం లేనివారితో బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుభాషిణి సూచించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తి యాప్ బాలికలకు రక్షణ ఇస్తుందన్నారు. యాప్‌ను ఉపయోగించే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్తవారు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నా, బండి ఎక్కమని మాయమాటలు చెబుతున్నా జాగురూకతతో వ్యవహరించాలని అన్నారు. సోషల్ మీడియా మాయలో పడవద్దని సూచించారు. ఒంటరిగా బయటకు వెళ్లేపుడు టీచర్‌లు, తల్లిదండ్రుల సూచనలు పాటించాలన్నారు. అనుమానితుల నుంచి ప్రమాదం పొంచి ఉందన్న ఆలోచన వస్తే పరిచయస్తులు, పోలీస్ వారి నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చి ప్రమాదం నుంచి తెలివిగా తప్పించుకోవాలన్నారు. అనంతరం శక్తి యాప్ పోస్టర్‌లను ప్రదర్శించారు. ఎస్ఐలు సంధ్యారాణి, చల్లా సురేష్, పిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.



ప్రమాద భరితంగా ఉన్ననటువంటి వంతెనపై గుంత

# ప్రయాణం.. ప్రమాదమే



వంతెనపై ఏర్పడిన గుంత

గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గం కొంకెరు వాగు వంతెనపై ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని ద్విచక్రవాహన దారులు వాపోతున్నారు. వంతెన మధ్యంలో పగలి పెద్ద గొయ్యి ఏర్పడింది. అర్ధరాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలు లైటు కాంతి ప్రభావం వలన బైకులు ఆదుపుతప్పి గుంతలో పడిపోవటం వలన తరుచూ మరమ్మత్తులకు వస్తున్నాయి. ట్రాఫిక్ వల్ల వాహనాలు సంఖ్య గణనీయంగా పెరగటం వలన వంతెనపై ఏర్పడిన గుంతలు సత్వరమే మరమ్మతులు చేయించి వాహనదారులకు పొంచియున్న ప్రమాదం నుంచి కాపాడాలని అధికారులను కోరుతున్నారు.

–శావల్యాపురం

### నేడు రైతులతో సమావేశం

నకరికల్లు: పైపులైన్ ఏర్పాటు చేసే క్రమంలో భూములను కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం విషయమై గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.పుల్లారావు బుధవారం తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల, నకరికల్లు, నర్సింగపాడు గ్రామాల్లో బీపీసీఎల్ పైపులైన్ ఏర్పాటు చేస్తున్న భూముల రైతులకు నష్టపరిహారం విషయమై సంబంధిత రైతులతో జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, బీపీసీఎల్ సంస్థ ప్రతినిధులు మాట్లాడి రైతుల అభిప్రాయాలను సేకరిస్తారని అన్నారు.

### ఏరియా వైద్యశాల ప్రాంగణంలో అన్నసంతర్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు అన్నం సత్యనారాయణ ధర్మపత్ని కీర్తిశేషులు అన్నం దేవకీదేవి పుణ్యతిథి సందర్భంగా బుధవారం 180 మంది రోగులు, సహాయకులకు అన్నసంతర్పణ నిర్వహించారు. దేవకీదేవి కుమారుడు న్యాయవాది అన్నం కృష్ణ, వారి కుటుంబ సభ్యులు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఉన్నారు.

### డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని డీఎస్పీ కార్యాలయాన్ని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు బుధవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల నకరికల్లు మండలంలో జరిగిన హత్య ఘటనపై చర్చించారు. అనంతరం పట్టణంలో విజువల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. ఆయనతోపాటు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు ఉన్నారు. అనంతరం డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు విజువల్ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలో పర్యటించారు.